www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -298 మంగళవారం 3 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# నేరాలు చేసి విచారణలు వద్దంటారా?

**అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి**

**వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా**

**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్**

**రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు**

హైదరాబాద్, **ఫిబ్రవరి2ప్రజావినికిడి**

తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో




# రాహుల్ చైనా వ్యాఖ్యలపై రచ్చ

**రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో లోక్‌సభలో తీవ్ర గందరగోళం**

**ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన ప్రతిపక్ష నేత**

**రాజ్‌నాథ్, అమిత్‌షా తీవ్ర అభ్యంతరం**

న్యూఢిల్లీ,,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం చెలరేగింది. 2020లో భారత్–చైనా సంక్షోభానికి సంబంధించి భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రస్తావించడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికార, విపక్షాల నడుమ వాగ్యుద్ధం, గందరగోళం నడుమ సభ మంగళవారానికి వాయిదాపడింది.

మిగతా 2లో...



# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

**బుల్లెట్ ట్రైన్ల కేటాయింపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 ::**

బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

మిగతా 2లో...

# సుంకాలు తగ్గాయ్

**భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్**

**ప్రధాని మోదీతో ఫోన్‌లో ట్రంప్ చర్చలు.. అనంతరం ట్రూత్ సోషల్‌లో పోస్టు**

న్యూయార్క్/న్యూఢిల్లీ**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్‌పై ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బదులుగా రష్యా చమురు కొనుగోళ్లు ఆపేస్తామని, అమెరికా చమురు ఉత్పత్తులను భారీగా కొనుగోలు

మిగతా 2లో...



# రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్

**ముఖ్యమంత్రి పదవి కూడా అలానే వచ్చిందేమో**

**కేసీఆర్ విచారణతో తెలంగాణ ఉద్యమం రోజులు గుర్తుకొచ్చాయి**

**సీఎం 60 సార్లు ఢిల్లీకి వెళ్లి సాధించింది ఏంటీ**

**ప్రభుత్వాన్ని నడపండి-బడ్జెట్‌పై దృష్టిపెట్టండిసజ్జనార్ జడ్జి కాదు**

**ఫోన్ ట్యాపింగ్‌లో ఆధారాలుంటే కోర్టుకివ్వాలి**

**దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం ప్రకటించాలి**

**: మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్**

**హైదరాబాద్ ఫిబ్రవరి2ప్రజావినికిడి**

తాము తెలంగాణ ప్రజలకు గులాం, ఢిల్లీకి గులాం కాదనీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ ప్రజలకు బానిసలుగా ఉంటామని చెప్పారు. సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్‌మెయిల్‌కు

మిగతా 2లో...



# మున్సిపోల్స్ గైడ్‌లైన్స్ విడుదల

**మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికకు 50 శాతం కోరం ఉండాల్సిందే**

**ఫిబ్రవరి16న చేతులెత్తే పద్ధతిలో నిర్వహణ**

హైదరాబాద్:

మున్సిపల్ పరోక్ష ఎన్నికలకు సంబంధించి సోమవారం తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్లను నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకుంటారు. ఎక్స్ అఫిషియో సభ్యులు తాము ఓటు వేయాలనుకున్న కార్పొరేషన్, మున్సిపాల్టీలో తమ ఓటు హక్కును ఫిబ్రవరి 11 నుంచి14 వరకు

మిగతా 2లో...

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

**సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ**




న్యూఢిల్లీ, **ఫిబ్రవరి2ప్రజావినికిడి**

కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది.

మిగతా 2లో...

# కేసీఆర్ విచారణ బూటకం!

**ఆయన, రేవంత్‌ది క్విడ్‌ప్రోకో -ఫోన్ ట్యాపింగ్ అసలు బాధితులం మేమే**

**రెండేళ్లయినా కేసును సాగదీస్తున్నారు -బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదు?**

**బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు -కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ విడుదల**

**మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపు**

హైదరాబాద్, **ఫిబ్రవరి2ప్రజావినికిడి**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారించడం ఓ బూటకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. కేసు పెట్టి రెండేళ్లు పూర్తయినా కాంగ్రెస్ సర్కారు ఇంకా విచారణ పేరిట కాలయాపన చేస్తోందని విమర్శించారు. అసలు

మిగతా 2లో...




# జోగిరమేశ్, అంబటిలపై దాడి ఏ రకమైనా ప్రజాస్వామ్యం

**గుండాలకు అండగా పోలీసులు నిలబడం దారుణం**

**జోగి రమేశ్ ఇంటిని పరిశీలించిన సజ్జల**

విజయవాడ,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటనలో టీడీపీ గూండాలకు పోలీసులకు రక్షణగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగంటల పాటు పోలీసుల సమక్షంలో అరాచకం రాజ్యమేలిందని ధ్వజమెత్తారు.

మిగతా 2లో...



# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ – బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ – చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ – పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026–27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

## జోగిరమేశ్, అంబటిలపై దాడి
# ఏ రకమైనా ప్రజాస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై టీడీపీ గూండాల దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిపై పరామర్శించేందుకు జోగి రమేష్ ఇంటికి సజ్జలతో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లారు. దాడికి సంబంధిచిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. గుంటూరు పోలీసుల సమక్షంలో అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేశారు. గుంటూరులో టీడీపీ గూండాలు ఏం చేశారో రాష్ట్రప్రజలు చూశారు. టీడీపీ గూండాలకు పోలీసులు రక్షణగా ఉన్నారు. అంబటిని కలిసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు యత్నించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన పార్టీ నేతల్ని అడ్డుకున్నారు. మాజీ హోంమంత్రి ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదు. బాధితుడినే పోలీసులు అరెస్టు చేశాను. మా నేతలను ఎస్పీ కార్యాలయంలో ఎదుట గంట సేపు ఎదురు చూయించారు. ప్లాన్ ప్రకారం అంబటి రాంబాబు,జోగి రమేష్ కుటుంబ సభ్యులపై దాడి జరిగింది. టీడీపీ గూండాలను పోలీసులు కంట్రోల్ చేస్తున్నట్లు యాక్ట్ చేశారు. జోగి రమేష్ కుటుంబానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని సజ్జల ప్రశ్నించారు. బటి,జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసిన గూండాలపై కేసులు పెట్టలేదు. దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టలేదు. కూటమి నేతల అరాచకాల్ని ఎదుర్కొంటాం. కూటమి అరాచకాల్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులు,నేతల్ని బెదిరింపులు, దాడులు చేసి బెదిరించాలని అనుకోవద్దు. అలా అనుకుంటే భ్రమే అవుతుంది'అని వ్యాఖ్యానించారు.

## నేరాలు చేసి విచారణలు వద్దంటారా?

(మొదటి పేజీ తరువాయి)

ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన ఆక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్–కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు గానూ సోషల్ మీడియా వారియర్ శశిధర్ గౌడ్, అలియాస్ నల్ల బాలుపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మూడు కేసులను హైకోర్టు కొట్టివేసింది.

# కేసీఆర్ విచారణ బూటకం!

(మొదటి పేజీ తరువాయి)

ట్యాపింగ్ జరిగిందే బీజేపీ నాయకులపైన అన్నారు. తమ పార్టీ నాయకులపై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. ట్యాపింగ్‌తోనే మునుగోడులో బీజేపీని ఓడించానికి బీఆర్ఎస్ సర్కారు ప్రయత్నించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి రెండేళ్లయినా నత్తనడకన విచారణ కొనసాగుతోందని, ఎవరిపైనా చర్యలు తీసుకోకుండా విచారణ మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ సర్కారు రేవంత్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, అందుకే ఇప్పుడు రేవంత్ సర్కారు కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇది క్విడ్‌ప్రోకో కిందకే వస్తుందన్నారు. నాడు బీఆర్ఎస్ రేవంత్‌కు సాయం చేయగా.. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్ పార్టీకి సాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు కేవలం విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇది యాక్టింగ్ మాత్రమేనని, యాక్షన్ కాదని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో రూ.2500 కోట్ల కుంభకోణం జరిగిందని, ప్రజల నుంచి పన్నుల డబ్బులు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి వెళు తున్నాయని రాంచందర్‌రావు విమర్శించారు. ఏ మునిసిపాలిటీలోనూ రోడ్లు, డ్రైనేజీలు లేవని.. కనీస మౌలిక వసతులు కొరవడ్డాయని ఆరోపించారు. "బూటకపు హామీలు–మోసపూరిత వాగ్దానాలు" పేరుతో కాంగ్రెస్ పాలనపై రూపొందించిన చార్జిషీట్‌ను సోమవారం తెలంగాణ మునిసిపల్ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జి ఆశిష్ షెలార్, మరో ఇన్‌చార్జి అశోక్ పర్ణామి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి రాంచందర్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు, 420 హామీలతో మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. పట్టణాలు అస్తవ్యవస్తంగా మారాయన్నారు. రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ పనులకు కేంద్రం నుంచి వచ్చే నిధులే ఆధారమవుతున్నాయని చెప్పారు.

# మున్సిపోల్స్ గైడ్‌లైన్స్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేసే వరకు నమోదు చేసుకోవచ్చు.

ఫిబ్రవరి 16న ఎన్నికైన సభ్యులతో సంబంధిత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అదే రోజు చేతులెత్తే పద్ధతిలో కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లను ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యుల్లో 50 శాతాన్ని కోరంగా పరిగణిస్తారు. అంతకన్నా తక్కువ మంది హాజరైనా, మరే ఇతర కారణాల చేత సమావేశం వాయిదా పడినా..ఆ ఎన్నికను తదుపరి రోజు నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ఎన్నికైన అభ్యర్థులు విప్ ఆదేశాలను పాటించకుంటే ఆయా పార్టీలు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారు.


**ఎక్స్ అఫిషియో సభ్యుల ఓటు నమోదు చేయండి**
**జిల్లా కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశం**

మున్సిపల్ పరోక్ష ఎన్నికల్లో పాల్గొనే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు హక్కు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ పరోక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 11 నుంచి 14 వరకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ చైనా వ్యాఖ్యలపై రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నిస్తూ తీవ్రంగా విమర్శించారు. తర్వాత మాట్లాడిన రాహుల్... తొలుత ఆయన విమర్శలకు స్పందిస్తానంటూ భారత్–చైనా సంక్షోభంపై జనరల్ నరవణె తన పుస్తకంలో పేర్కొన్న స్మృతులను ప్రస్తావించేందుకు ప్రయత్నించారు. మంత్రి రాజ్‌నాథ్ అభ్యంతరం తెలిపారు. ఆ పుస్తకం ప్రచురితమైందో లేదో రాహుల్ స్పష్టత ఇవ్వాలన్నారు. అయితే చైనా ట్యాంకులు అన్న పదాన్ని విపక్ష నేత పదే పదే లేవనెత్తాలని చూడడంతో సభలోని ప్రతి బీజేపీ నేతా తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఆ పుస్తకం అధికారికం కాదని.. ఇంతవరకు ప్రచురణకే నోచుకోలేదని.. దానిలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని రాజ్‌నాథ్ నిలదీశారు. సైనిక దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ సమయంలో సభలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను ఆయన ఎలా ప్రస్తావిస్తారని అమిత్‌షా నిలదీశారు. తన మాటలకు వారు భయపడకపోతే ఎందుకు మాట్లాడనివ్వడం లేదని రాహుల్ ప్రశ్నించారు. తాను చదివేది నూరు శాతం అధికారికమన్నారు. సభ కార్యకలాపాలతో సంబంధం లేని పుస్తకం లేదా దినపత్రిక క్లిప్పింగ్‌లలోని అంశాలను ప్రస్తావించడానికి వీల్లేదని స్పీకర్ ఓం బిర్లా రూ లింగ్ ఇచ్చారు. అయితే తాను చదువుతున్నది అధికారికమైనదేనని, దాని నుంచి కోట్ చేస్తానని రాహు ల్ స్పష్టంచేశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించలేదని.. అందుచేత దానిని ప్రస్తావించడానికి వీల్లేదని రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు.



జనరల్ నరవణె రాసిన పుస్తకాన్ని ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదని రాహుల్ ఆరోపించారు. తన వైఖరిని తెలియజేసేందుకు వేరే మ్యాగజైన్ వ్యాసంలోని అంశాలను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. దీనిని కూడా స్పీకర్ అనుమతించలేదు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. రాహుల్ ఆరోపిస్తున్నట్లు ప్రభుత్వం గనుక ఆ పుస్తకం ప్రచురణను అంగీకరించనట్లయితే జనరల్ నరవణె కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. సభను ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సభాపతి రూలింగ్ ఇచ్చిన తర్వాత కూడా విపక్ష నేత దానిని ఉల్లంఘిస్తున్నారని మంత్రి రిజిజు ఆక్షేపించారు. ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించొద్దని ఓం బిర్లా పలు సార్లు హెచ్చరించినా రాహుల్ వినిపించుకోలేదు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడడం ఆయనకు ఇష్టం లేకపోతే తదుపరి వక్తగా ఉన్న ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు అవకాశమిస్తానని సభాపతి స్పష్టంచేశారు. అఖిలేశ్, టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ తదితరులు రాహుల్‌కు మద్దతిచ్చారు. అటు విపక్షం, ఇటు అధికార పక్ష సభ్యులు పరస్పరం నినాదాలకు దిగడంతో స్పీకర్ తొలుత మధ్యాహ్నం 3 గంటల వరకు ఒకసారి.. 4గంటల వరకు రెండోసారి సభను వాయిదావేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. చివరకు సభ మంగళవారానికి వాయిదాపడింది.

**స్పీకర్ ముందస్తు అనుమతితోనే..:**

పుస్తకాలు, మ్యాగజైన్లు, పత్రికల్లోని అంశాలను ప్రస్తావించడంపై పార్లమెంటు నిబంధనల్లో నిషేధం లేదని పార్లమెంటరీ నిపుణులు స్పష్టం చేశారు. అయితే ప్రచురితమైన వాటిలోని అంశాలను స్పీక ర్ అనుమతితో ప్రస్తావించవచ్చని.. అయితే ఆయనకు ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని రాజ్యసభ మాజీ సెక్రటరీ జనరల్ వీకే అగ్నిహోత్రి తెలిపారు. 'లోక్‌సభలోని 349(1) నిబంధన ఏం చెబుతోందంటే.. సభ సమావేశమైనప్పుడు.. సభ కార్యకలాపాలతో సంబంధం ఉంటే తప్ప ఏ పుస్తకం, దినపత్రిక, లేఖను కూడా చదవరాదు. స్పీకర్ అనుమతించినా.. తాను చదివే సమాచారం ధ్రువీకరణ గు రించి ఆ సభ్యుడిని ప్రశ్నించవచ్చు. ప్రచురించని పుస్తకంలోని అంశాలను ప్రస్తావించాలని రాహుల్ ప్రయత్నించారు' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**నన్ను మాట్లాడనివ్వడం లేదు: రాహుల్**

జనరల్ నరవణె పుస్తకంలోని అంశాలను సభలో తనను లేవనెత్తనివ్వడం లేదని, తనను మాట్లాడనివ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. చైనాతో సంక్షోభానికి సంబంధించి ప్రధాని మోదీని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను జనరల్ అందులో తప్పుబట్టారని పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులకు తెలిపారు. ఆయన అభిప్రాయాలు ఓ వ్యాసంలో వచ్చాయని.. వాటినే తాను ప్రస్తావించానని చెప్పారు. అది బయటకు వస్తే వారిద్దరి బండారం బయటపడుతుందని.. అందుకే తాను ప్రస్తావించిన వాక్యాలు అధికార పక్షాన్ని భయపెడుతున్నాయన్నారు. జనరల్ నరవణె రాసిన పుస్తకం ప్రచురణకు నోచుకోకుండా మగ్గిపోతోందన్నారు. రాహుల్‌ను ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా గట్టిగా సమర్థించారు. ఆయన మన సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం లేదని.. ఆర్మీ చీఫ్ పుస్తకం నుంచే ప్రస్తావిస్తున్నారని.. తాము దాచదలచుకున్న అంశాలు బయటకు వచ్చినప్పుడల్లా బీజేపీ నేతలు ఇలాగే చేస్తుంటారని ధ్వజమెత్తారు.

# రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్

(మొదటి పేజీ తరువాయి)

బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆర్టీఐ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం ఆయన వృత్తి అని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని కూడా బ్లాక్‌మెయిల్ చేసి తెచ్చుకున్నాడేమోనని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌ను సిట్ విచారణ చేసిన నేపథ్యంలో ఆదివారం దాదాపు ఏడు వేలకుపైగా గ్రామాలు, పట్టణాల్లో నిరసనలు, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు జరిగాయని అన్నారు. తెలంగాణ ఉద్యమం రోజులు, ఉద్యమ స్ఫూర్తి గుర్తుకొచ్చాయని చెప్పారు. తమలో స్ఫూర్తిని నింపిన బీఆర్ఎస్ కార్యకర్తలకు, వారిని తట్టిలేపిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు ప్రకటించారు. కేసీఆర్ సిట్ విచారణకు రావాల్సిన అవసరం లేదన్నారు. కోర్టుకు వెళ్లే అవకాశముందని అన్నారు. అధికారికంగా 900 మంది పోలీసులు, అనధికారికంగా రెట్టింపు మంది ఉన్నారని వివరించారు.

పరిపాలనా వైఫల్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇబ్బంది పడుతున్నారని కేటీఆర్ అన్నారు. మేడారం జాతర తెలంగాణ కుంభమేళా అని చెప్పారు. అధికారంలో ఎవరున్నా ఏర్పాట్లు ఘనంగా ఉంటాయని వివరించారు. నామమాత్రంగా మంత్రివర్గ సమావేశాన్ని ములుగులో నిర్వహించారని అన్నారు. ఏర్పాట్లు సరిగ్గా చేయనందుకు జాతర సందర్భంగా మంత్రి కారు అద్దాలను పగలగొట్టారని చెప్పారు. సుల్తాన్‌బజార్‌లో పట్టపగలు ఉదయమే ఏటీఎం వద్ద కాల్పులు జరిపి రూ.లక్ష ఎత్తుకెళ్లారని అన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం ఉందన్నారు. సహజ వనరులను, జల వనరుల దోపిడీని ప్రభుత్వం కాపాడ్డం లేదని చెప్పారు.

పాత బాసు చంద్రబాబు, కేసుల కోసం కేంద్రాన్ని ఏమీ అనడం లేదన్నారు. సింగరేణిలో సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి దోపిడీపై బయటపెట్టినా భట్టి, కిషన్‌రెడ్డి సరైన సమాధానం చెప్పకుండా బుకాయిస్తున్నారని విమర్శించారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. సింగరేణిలో ఎంత మంది సైట్ విజిట్‌కు వచ్చారో శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దానికోసం సృజన్‌రెడ్డి ఫోన్ చేసిన కాల్ డేటాను చూస్తే అన్ని విషయాలు బయటకొస్తాయని అన్నారు. పాలనా వైఫల్యం, భూదోపిడీ, జలదోపిడీ, బొగ్గు దోపిడీ, శాంతి భద్రతల వైఫల్యం కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మరల్చడం కోసమే కేసీఆర్‌కు సిట్ నోటీసుల పేరుతో డ్రామా నడిపించారని విమర్శించారు.

**సజ్జనార్ అత్యుత్సాహం మంచిది కాదు**

సిట్ చీఫ్ సజ్జనార్ జడ్జి కాదని కేటీఆర్ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి ఆయన వద్ద ఏమైనా సమాచారం ఉంటే కోర్టుకు ఇవ్వాలని సూచించారు. చట్టబద్ధమా? చట్టవిరుద్ధమా? అనేది కోర్టు నిర్ణయిస్తుందన్నారు. సజ్జనార్‌కు అత్యుత్సాహం మంచిది కాదని చెప్పారు. తమ పార్టీ నాయకుడు కేసీఆర్‌ను అక్రమ కేసులతో వేధిస్తే ఊరుకుంటామా?, తప్పకుండా స్పందిస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడుసార్లు దావోస్ పర్యటనకు వెళ్లారని చెప్పారు. ఆ పెట్టుబడులపై శ్వేతపత్రం ప్రకటించాలనీ, ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, మేఘా కృష్ణారెడ్డి జూబ్లీహిల్స్‌లోనే ఉన్నా దావోస్‌కు వెళ్లి ఒప్పందం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

**మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటుతాం**

మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటుతామని కేటీఆర్ అన్నారు. ఎక్కడికక్కడ స్థానికంగా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. రోడ్‌షోలు, అట్టహాసం చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 143 మున్సిపాల్టీల్లో 135 వరకు గెలిచామని అన్నారు. ఇప్పుడు 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లలో మెజార్టీ స్థానాలను గెలుస్తామని చెప్పారు. సిర్పూర్, షాద్‌నగర్ మున్సిపాల్టీలను తప్పకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# సుంకాలు తగ్గాయ్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న టారిఫ్‌లను దశలవారీగా సున్నాకు తగ్గిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై వేసిన అదనపు 25శాతం సుంకాల అంశాన్ని ట్రంప్ ప్రస్తావించలేదు. కానీ భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ సోమవారం రాత్రి జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌పై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించినట్టుగా వెల్లడించారు. మరోవైపు సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 18శాతానికి సుంకాలను తగ్గించడంపై ట్రంప్‌కు 140 కోట్ల మంది భారతీయుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేత తదితర అంశాలు వేటినీ మోదీ ప్రస్తావించలేదు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందంటూ గతేడాది జూలైలో 25శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా నుంచి వద్దన్న చమురు కొంటోందంటూ ఆగస్టులో సుంకాలను 50శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

సోమవారం ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో తొలుత ఈ విషయాన్ని వెల్లడించారు. తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. "నా గొప్ప స్నేహితుల్లో ఒకరు, శక్తివంతమైన నేత ప్రధాని మోదీతో మాట్లాడాను. వాణిజ్యం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం సహా చాలా అంశాలపై చర్చించాం. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేసేందుకు.. అమెరికా నుంచి, ముఖ్యంగా వెనెజువెలా నుంచి భారీగా చమురు కొనుగోలు చేసేందుకు మోదీ అంగీకరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ఇది తోడ్పడుతుంది. మిత్రుడు మోదీ విజ్ఞప్తి మేరకు, ఆయనపై గౌరవంతో.. యూఎవీస–భారత్ వాణిజ్య ఒప్పందానికి అంగీకరించాం. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నాం. బదులుగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను క్రమంగా సున్నాకు తగ్గిస్తుంది. వాణిజ్య అడ్డంకులను తొలగిస్తుంది. రూ.45.5 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) విలువైన అమెరికా చమురు, బొగ్గు, సాంకేతిక, వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుంది. దీనికి అదనంగా వీలైనంత ఎక్కువగా అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో మా బంధం మరింత బలోపేతం అవుతుంది. ప్రధాని మోదీ, నేను ఇద్దరం గొప్ప పనులు పూర్తి చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మూడు రోజుల పర్యటన కోసం సోమవారం వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అరుదైన ఖనిజాల సరఫరాకు సంబంధించిన సమావేశంలో పాల్గొననున్నారు.

భారతీయ సైనిక అమరులకు గుర్తుగా ఢిల్లీలో ఠీవిగా నిలబడిన 'ఇండియా గేట్'పై ట్రంప్ కన్ను పడింది. అలాంటిది తమకూ కావాలని అనిపించింది. ట్రంప్ స్వయంగా దీనిపై ట్రూత్ సోషల్‌లో ఇండియా గేట్ ఫొటోతో పోస్టు పెట్టారు. "ఇది భారత్ విజయ ద్వారం. మేం కట్టబోయేది ఇలాంటి వాటన్నింటికన్నా గొప్పగా ఉంటుంది" అని పేర్కొన్నారు. తర్వాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా నగరాలకు విజయ ద్వారాలు ఉన్నాయని.. గొప్ప దేశమైన అమెరికాలోని వాషింగ్టన్‌లో మాత్రం లేదని పేర్కొన్నారు. పారివీసలోని 'ఆర్క్ డె ట్రయంఫ్' తరహాలో ప్రపంచంలోనే గొప్పగా, అందంగా వాషింగ్టన్‌లో విజయ ద్వారాన్ని నిర్మిస్తామని చెప్పారు.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సెటైర్లు వేశారు. "ఆపరేషన్ సిందూర్ ఆగినప్పుడు, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి.. ఇప్పుడు వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా నుంచి ట్రంపే మొదట ప్రకటించారు. ట్రంప్‌తో మోదీ మాట్లాడిన విషయాన్ని కూడా అమెరికా రాయబారి ప్రకటించారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాలను మన ప్రభుత్వం నుంచి కాకుండా.. అమెరికా అధ్యక్షుడి నుంచి భారత ప్రజలు తెలుసుకుంటున్నారు. మోదీ పూర్తిగా ట్రంప్‌కు లొంగిపోయారు. మోదీ ఆత్మ నిర్భరత కాదు.. ట్రంప్ నిర్భరత" అని విమర్శించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 3 ఫిబ్రవరి 2026

# కాంగ్రెస్ పార్టీ లో చేరిన చౌదర్ గూడ ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్..





**ప్రజావినికిడి, (శంషాబాద్): ఫిబ్రవరి 2,** మండల పరిధిలోని చౌదర్ గూడ ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్ తన మిత్రబృందంతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలో చౌదర్‌గూడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్‌రాజ్ తన అనుచరులతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ నీరటి తన్వి రాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చౌదర్‌గూడ ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్, వార్డు సభ్యురాలు మామిళ్ళ సబిత, మాజీ వార్డ్ సభ్యుడు మల్లేష్ యాదవ్,వార్డు సభ్యురాలు మల్చలంమంజుల, జంగారావు,మాజీ వార్డు సభ్యుడు మునగల సంజీవ్, పల్లె విజయ్ కుమార్,మామిళ్ళ మురళి,మునగాల ముఖేష్,భరత్, శరత్,సాయి, యాదయ్య, సత్తయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చౌదర్‌గూడ సర్పంచ్ లక్ష్మీ లింగం,మాజీ ఎంపీటీసీలు తొంట అశోక్,చందనవెల్లి శివాజీ,శ్రీనివాస్, వార్డు సభ్యులు నవీన్,గణేష్ విలేజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్చలం దేవేందర్,పార్టీ సీనియర్ నాయకులు, విశ్వనాధ్,చౌట శేఖర్ యాదవ్, అశోక్,శేఖర్, మైనారిటీ సోదరులుతదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కార దిశలో సమీక్ష సమావేశం..

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):**
సోమవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల డిస్టిక్ మేనేజర్ హరీష్ ని రేషన్ డీలర్ల పలు సమస్యల మీద వారిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సర్కిల్ 3 నందు దాదాపు 105 రేషన్ షాప్ లు ఉన్న నేపథ్యంలో ప్రతినెల కొంగరకలన్ నందు పౌరసరఫరాల గోడౌన్ కు ప్రతి ఒక్క డీలర్ వచ్చి వేలిముద్రలు వేయడం జరుగుతున్న నేపథ్యంలో పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు అని అన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి కొంగరకలన్ రావడానికి సరిఅయిన ట్రాన్స్పోర్ట్ వ్యవస్థ లేదని,దాదాపు 35 కిలోమీటర్ల దూరం ఉందని,అలాగే డీలర్లలో కొందరు వికలాంగులు,మహిళలు ఉండడం వల్ల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అని అన్నారు. నెలలో దాదాపు మూడుసార్లు రావాల్సి వస్తుంది అని అన్నారు. సరిఅయిన సమయంలో బియ్యం రావడం లేదని అన్నారు. అక్కడ సరిఅయిన వసతులు లేవని అన్నారు. కావున ప్రత్యామ్నాయంగా బడంగ్పేట్ వద్ద గోడౌన్ ఉందని కావున అక్కడికి తరలిస్తే ప్రతి ఒక్క డీలర్లకు ఉపయెగం ఉంటుంది అని అన్నారు. దానికి స్పందించిన వారు అధికారులతో చర్చించి తప్పకుండా బడంగ్పేట్ తరలించేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,చెన్నగొని శ్రీధర్ గౌడ్,చిరంజీవి,మహేష్ రెడ్డి,సందీప్,యాదయ్య ,ఇంద్రకరణ్ రెడ్డి పలువురు డీలర్లు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా మహాసభ..

## 25 వరకు సభ్యత్వ నమోదు..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా మహాసభ ఈనెల చివరి వారంలో నిర్వహించాలని ఫెడరేషన్ జిల్లా అడ్ హక్ కమిటీ నిర్ణయించింది. సోమవారం సికింద్రాబాద్ పద్మారావునగర్ లోని ఎస్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాలులో అడ్ హక్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ వి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు,జిల్లా కో-కన్వీనర్లు పాల్గొని హైదరాబాద్ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యల, సంఘ నిర్మాణాంశాలపై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ను ఫెడరేషన్ లో సభ్యులుగా చేర్చుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కమిటీల ఎన్నిక జరపాలని,ఈ నెల చివరి వారంలో జిల్లా మహాసభ జరపాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, అనేక మీడియా సంస్థలకు కేంద్ర బిందువైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో దాదాపు నాలుగైదు వేల మంది జర్నలిస్టులున్నారని,వీరిలో రిపోర్టర్లతో పాటు సబ్ ఎడిటర్లుగా పిలవబడే డెస్క్ జర్నలిస్టులు, ఫోటో,వీడియో జర్నలిస్టులున్నారని అన్నారు. జర్నలిస్టుల్లో ఐక్యత లేకపోవడం వల్ల అనేక ఏళ్ళుగా కనీస హక్కులను సాధించుకోలేక అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇండ్ల స్థలాలు పొందలేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలనకు కేంద్రం,పాలకులకు నిలయంగా ఉన్న హైదరాబాద్ నగరంలో పాత్రికేయులకు నివేశ స్థలాలు లేకపోవడం శోచనీయమని, గత పాలకులు జర్నలిస్టులకు అన్యాయం చేశారని,ఈ ప్రభుత్వం కూడా సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జర్నలిస్టులను ఐక్య పరిచి సమస్యలపై త్వరలో కార్యాచరణ చేపట్టాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. జిల్లా,రాష్ట్ర మహాసభల తర్వాత జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త యాత్ర ఉంటుందని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్,జిల్లా కో-కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, పి.సంతోష్ కుమార్,సీహెచ్ బ్రహ్మం,ఎం. రవికుమార్, నాయకులు పద్మారావు, సంపత్ కుమార్, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు హైదరాబాద్ జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు.



# కేంద్రంది ప్రజా వ్యతిరేక బడ్జెట్

## హేమా సుదర్శన్ జిల్లోజు




**ప్రజా వినికిడి, (హిమాయత్ నగర్) :**
కేంద్ర ప్రభుత్వంది ప్రజా వ్యతిరేక బడ్జెజ్ అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు విమర్శించారు. దేశ చరిత్రలోనే అత్యంత నిరాశాజనకమైన వరస్ట్ బడ్జెట్ గా మిగిలిపోతుందని వ్యతిరేకించారు. దేశం బాగుండాలంటే విద్య, వైద్యం ప్రధానమని ఈ రెండు రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ పై హైదరాబాద్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మొత్తం బడ్జెట్లో విద్య, వైద్యానికి కలిపి 5శాతం కూడా నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపుల్లో యువత భవిష్యత్తును కేంద్రం తాకట్టు పెడుతుందని, ఉద్యోగాలు లేని యువతతో దేశం ఎలా ముందుకు సాగుతుందో ప్రశ్నించారు. మరో పక్క తెలంగాణ రాష్ట్రం నుంచి వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్ళిపోతుంటే తిరిగి తెలంగాణకు దక్కింది సున్నా మాత్రమేనని అన్నారు. తెలంగాణకు రావలసిన ప్రాజెక్టు నిధులు అన్నిటిని కేంద్రం ఉద్దేశపూర్వకంగానే పెండింగ్లో పెట్టి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చూపించిన నిర్లక్ష్యం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ద్రోహి బడ్జెట్ కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ రోడ్డెక్కి పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ బేగ్, కొడంగల్ శ్రీనివాస్, రాజ్, రమ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం కన్నకూతురు బలి

## ముగ్గురు సంతానం నిబంధనతో ఒకరిని చంపేసిన తండ్రి

## బాలిక హత్యను ఛేదించిన నిజామాబాద్ పోలీసులు

నిజామాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**
పంచాయితీ ఎన్నికల కోసం ఓ తండ్రి కన్నకూతురునే బలితీసుకున్నాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి తన స్వార్థం కోసం అభం శుభం తెలియని ఆరేళ్ల కూతురిని హత్య చేసిన సంఘటన కలకలం రేపుతోంది. ఈ సంఘటన నిజామాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన పాండురంగ, త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. అయితే, ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హత ఉందని పాండురంగ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ఆరేళ్ల పెద్ద కూతురు ప్రాచీని బైక్‌పై తీసుకొచ్చి నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఎఆర్‌పి శివారులో కాలువలో పడేసి చంపేశాడు. కెనాల్‌లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని బయటకు తీసి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో కన్న తండ్రే హంతకుడని తేలింది. పాండురంగ్‌తో పాటు అతనికి సహకరించిన గణెళిష్ షిండేను అరెస్ట్ చేశారు. బాలికను తీసుకువచ్చేందుకు ఉపయోగించిన బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ కేసులో మృతురాలు తండ్రి పాండురంగతో పాటు కేరూరు సర్పంచ్ గణెళిష్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# నూతనంగా ఎన్నిక అయిన కార్యవర్గ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** సోమవారం రోజు వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నిక అయిన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కాలనీ యొక్క అభివృద్ధి విషయంలో నా యొక్క సహాయసహకారాలు ఎల్లప్పుడూ, ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్,అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి,ఉపాదక్షులు గోపాల్ రెడ్డి,రాజగోపాల్ రావు,కార్యదర్శి యు.వీ.ఎస్.బాబు,సంయుక్త కార్యదర్శి రవికాంత్,నర్సింహారెడ్డి,కోశాధికారి అంజయ్య యాదవ్,కమిటీ సభ్యులు ఆశీర్వాదం,ఝాన్సీ లక్ష్మీబాయి,సుకృత,కరుణాకర్అజయ్ కుమార్,మహిపాల్ రెడ్డి,రవీంద్ర రెడ్డి,నర్సింహా,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కులం కాదు..గుణం చూసి ఓటేయండి

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్,ఫిబ్రవరి2ప్రజావినికిడి**
మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విస్తృత బందోబస్తు

## పట్టణ పరిధిలో పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు

మేడ్చల్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి** రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. యెల్లంపేట్, రావల్కోల్, రాజబొల్లారం తండా మున్సిపాలిటీ పరిధిలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, దుండిగల్ పోలీస్ సిబ్బంది, జోనల్ ఫోర్స్‌తో కలిసి రావల్కోల్ గ్రామ పరిధిలో వాహనాల తనిఖీలు, ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని పేర్కొన్నారు.ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు విజిబుల్ పోలిసింగ్ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# కేసీ తండాలో విషాదం

## ఆడుకుంటూ వెళ్లి చెరువులో పడి ఇద్దరు బాలల మృతి

రంగారెడ్డి,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

:మహేశ్వరం మండల కేంద్రంలోని కేసీ తండాలో విషాదం చోటు చేసుకుంది. ఆడుకుంటున్న ఇద్దరు బాలురు కేసీ తండా సమీపంలోని కొత్వాల్ చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు. కేసీ తండాకు చెందిన జటావత్ రిషి, బద్రీనాథ్ అనే ఇద్దరు బాలురు ఆటలాడుకుంటూ చెరువు సమీపానికి వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయారు. వారి కుటుంబ సభ్యులు, స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. చెరువులో గాలింపు చర్యలు చేపట్టిన బృందం కొద్దిసేపటికే ఇద్దరి మృతదేహాలను వెలికితీసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనతో కేసీ తండా ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చిన్నారుల మరణంతో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బైక్‌పై పడ్డ జెసిబి వాహనం

## ఘటనలో బాలుడు దుర్మరణం

వికారాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

వికారాబాద్ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. జేసీబీని తీసుకెళుతున్న ట్రక్కు.. బైక్‌పై బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మరణించాడు. బాలుడి తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ధారూరు మండలం కొండాపూర్ కలాన్ నుంచి 8 ఏళ్ల రిత్విక్ తన తండ్రి లాలయ్యతో కలిసి బైక్‌పై వికారాబాద్ వెళుతున్నాడు. బైక్ వెనకాలే స్కూటీపై రిత్విక్ తల్లి మేఘన, చెల్లెలు ఫాలో అవుతున్నారు. వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామేశ్వర ఆలయం మలుపులో ఊహించని విషాదం చోటుచేసుకుంది. జేసీబీని తీసుకెళుతున్న ట్రక్కు మలుపు వద్ద అదుపుతప్పి.. బైక్‌పై బోల్తా పడింది. దీంతో రిత్విక్ అక్కడికక్కడే చనిపోయాడు. లాలయ్య కాలు విరిగింది. స్కూటీపై వెళ్తున్న తల్లీకూతుళ్లకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే స్పందించి.. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ట్రక్కు డ్రైవర్ తాగి ఉన్నాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిత్విక్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# చెత్తకుప్పలో వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి,**ఫిబ్రవరి2ప్రజావినికిడి** కామారెడ్డిలో దారుణం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తిని దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. పట్టణంలోని ఓ ప్రార్థనా మందిరం సమీపంలో ఉన్న చెత్తకుప్పలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ముక్కలు చేసి సంచిలో పెట్టి అక్కడ పడేశారు. కాళు ,, మొండెం అందులో ఉన్నాయి. కనిపించని తల, చేతుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. దుండగులు ఎక్కడో హత్య చేసి మృతదేహం సగభాగాన్ని ఇక్కడ పడేసినట్లు అనుమానిస్తున్నారు.

# రేబిస్ వ్యాక్సిన్ వికటించి పాప మృతి

## విచారణ చేపడతామన్న ఆర్ఎంవో

కామారెడ్డి**ఫిబ్రవరి2ప్రజావినికిడి** యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వికటించి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కామారెడ్డిలో చోటుచేసుకున్నది. చిన్నారి మృతి ఘటనపై విచారణ చేపడుతామని ఆర్ఎంవో సంతోష్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు దవాఖాన నుంచి బయటికి వెళ్లారని, ప్రైవేట్ దవాఖానకు సుమారు 2.30 గంటలకు వెళ్లారని ఈ మధ్యలో ఏమి జరిగిందో విచారణ చేసిన తర్వాత చెప్పగలమని ఆయన పేర్కొన్నారు. రెండు డోస్‌లు వేసినప్పుడు పాప బాగానే ఉన్నదని, మూడో డోస్ వేసినప్పుడు కూడా బాగానే ఉన్నదని తెలిపారు. విచారణ తరువాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన అర్చన-రమేశ్ దంపతులు కామారెడ్డిలోని అయ్యప్ప నగర్‌కాలనీలో నివాసముంటున్నారు. వీరికి బాబు, పాప ఉన్నారు. జనవరి 25న ఇంటి ఎదుట ఆడుకుంటుండగా రెండున్నరేండ్ల క్రితిక్ సారాను కుక్క కరిచింది. కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన తరలించగా, ఇంజెక్షన్ ఇచ్చారు. ఆదివారం మూడో డోస్ ఇప్పించడానికి చిన్నారిని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. డోస్ తీసుకోగానే చిన్నారి అపస్మారక స్థితికి చేరగా, వెంటనే ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. దవాఖానలోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పినా వినిపించుకోకుండా సుమారు రెండున్నర గంటలపాటు ఆందోళన చేశారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి ఫిబ్రవరి2ప్రజావినికిడి**

ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

జిల్లాలో మొత్తం 200 పరీక్షా కేంద్రాల ద్వారా 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70,171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, ఇందుకు సంబంధించి 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షల సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సదుపాయం కల్పించాలని ఆదేశించారు.అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులతో మెడికల్ పాయింట్లు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన ఫర్నీచర్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోస్టల్ శాఖ అధికారులు జవాబు పత్రాలను సక్రమంగా రిసీవ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, ఫ్యాన్స్, టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, పోలీస్, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**అనంతగిరి : ఫిబ్రవరి2ప్రజావినికిడి**



వాయిలసింగవరం గ్రామంలో సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు...ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతగిరి మండల ఉపాధి హామీ పథకం ఏపీవో నూకబత్తిని వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ 2006 ఫిబ్రవరి 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లమూడి గ్రామంలో అప్పటి ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభించబడిందని గుర్తు చేశారు...గ్రామీణ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా పేదలు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం శుభపరిణామమని తెలిపారు. ఈ పథకానికి ఇప్పటివరకు ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనే పేరును కొనసాగించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు...ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సౌమ్య, మేట్లు కొల్లు సుబ్బారావు, గడ్డం వీరబాబు, బుర్రా వీరబాబు, గరిడేపల్లి కనకయ్య, బుర్రా ఉమ, బుర్రా చిలకమ్మ, బాదరబోయిన నాగేంద్ర, ఉపాధి హామీ పథకం కూలీలు, గ్రామ పంచాయితీ సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాల్లో పులుల కలకలం..

# భయం గుప్పిట్లో జనం





**ఫిబ్రవరి 2 (జర్నలిస్టు జర్నీ న్యూస్)**పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

**యాదాద్రి జిల్లాలోనూ ఇదే సీన్..**యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# పోమాల్ పల్లిలో శ్రీశ్రీశ్రీ లక్ష్మివెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు

## స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**ప్రజావినికిడి, (కేశంపేట):**

కేశంపేట మండలం పోమాల్ పల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వెంకటేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్,మాజీ సర్పంచ్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్,తూర్పు గడ్డ తండా సర్పంచ్ తుకారాం,లేమామామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్,

మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,ఆంజనేయులు,మాజీ ఎంపిటిసిలు రాంచందర్,యాదయ్య,ఉపసర్పంచ్ సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి,సుదర్శన్,తాండ్ర నరేందర్ రెడ్డి,మన్మధ రెడ్డి,సాజీద్,నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరకమానసిక స్థితి మెరుగైతుంది

## ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

## కేశంపేట మండల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**

క్రీడలతో మానసిక శారీరక,ఆరోగ్య పరిస్థితులు మెరుగవుతుందని,క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడుతూ మండల్ లెవెల్ నుండి రాష్ట్ర దేశ స్థాయి వరకు రాణించాలని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.కేశంపేట మండలంలో మండల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ సీసన్-1 ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల్ లెవెల్ క్రీడాకారులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్,మాజీ సర్పంచ్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,తూర్పు గడ్డ తండా సర్పంచ్ తుకారాం,లేమామామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్,మాజీ సర్పంచ్ జంగయ్య, ఆంజనేయులు, మాజీ ఎంపిటిసిలు రాంచందర్, యాదయ్య, ఉపసర్పంచ్ సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి,సుదర్శన్,తాండ్ర నరేందర్ రెడ్డి, మన్మధ రెడ్డి,సాజీద్,నాగరాజ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక




# మసిపూసి మారేడుకాయ!



విజయవాడ**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యనులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటి?అన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బ్జడెట్'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం, ÷నాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతనం, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేమీ కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి అర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.

# కావాలనే ఎపిలో అల్లర్లకు వైసిపి కుట్ర

**శాంతిభద్రతలు సమస్య సృష్టించే పన్నాగం -బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, పురందేశ్వరిల ఆగ్రహం**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

ఏపీలో కావాలనే జగన్ అండ్ కో అల్లర్లు సృష్టించారని బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, పురంధేశ్వరిలు మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించాలన్న కుట్రలు బయటపడ్డాయని అన్నారు. జగన్ కనుసన్నల్లోనే జోగి రమేశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో శాంతిభద్రతలు ఉన్నాయా లేదా అనేది కేంద్ర ప్రభుత్వానికి తెలుసన్నారు. మూడు రోజుల నుంచి ఏపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తున్నామన్నారు. అంబటి, జోగి రమేశ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబుది కన్‌స్ట్రక్టివ్ మోడ్.. జగన్‌ది డిస్ట్రక్టివ్





మోడ్ అని ఎంపీ రమేశ్ విమర్శించారు. కావాలనే వైసీపీ నేతలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని రమేశ్ ÷ర్ అయ్యారు. వైసీపీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని సూచించారు. కూటమి నేతలు ఎవరూ తప్పు చేయొద్దని కోరారు. సీఎం చంద్రబాబు ఏపీలో శాంతిభద్రతలను కాపాడుతున్నారని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు ఏపీలో సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు. ఏపీలో ఉండే వైసీపీ నాయకులకు బ్జడెట్‌పై ఏ మాత్రం అవగాహన లేదని ఎంపీ రమేశ్ అన్నారు. మరోసారి వారు బ్జడెట్ పూర్తిగా చదువుకోవాలని సూచించారు. వైసీపీ నేతలకు ఎంతసేపూ దోచుకోవాలి, దాచుకోవాలనే ఆలోచనేనని ఎంపీ రమేశ్ విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా అంబటి వ్యాఖ్యలున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు తల్లిని అవమానించే విధంగా అంబటి మాట్లాడారని ఆగ్రహించారు. మహిళా లోకం కూడా ఆయన వ్యాఖ్యలను సహించదని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలను సభ్యసమాజం గర్హిస్తుందన్నారు.

## చర్లపల్లి విషాదం.. ఒంటరితనమే

# తల్లీబిడ్డల ప్రాణం తీసిందా?

**హైదరాబాద్ శివార్లలో ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య**

**ఒంటరితనమే ఈ దారుణానికి కారణమని పోలీసుల ప్రాథమిక అంచనా**

**కారులో సూసైడ్ నోట్.. వాట్సప్‌లో స్టేటస్‌గా పెట్టిన విజయరెడ్డి**

**విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**కుటుంబ, ఆస్తి గొడవల కోణంలోనూ కొనసాగుతున్న దర్యాప్తు**

**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

హైదరాబాద్ శివార్లలో జరిగిన తల్లీబిడ్డల ఆత్మహత్య ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్‌పై ఐటీ ఉద్యోగిని విజయరెడ్డి తన ఇద్దరు పిల్లలు చేతన, విశాల్‌తో కలిసి బలవన్మరణానికి పాల్పడటం తెలిసిందే. ఈ దారుణానికి ఆమెలో పేరుకుపోయిన ఒంటరితనమే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.వివరాల్లోకి వెళితే... ఉప్పల్



రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన విజయరెడ్డికి సురేందర్‌రెడ్డితో 2007లో వివాహమైంది. భర్త సురేందర్‌రెడ్డి నాలుగేళ్లుగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండటంతో, విజయరెడ్డి తన తల్లితో కలిసి ఉంటున్నారు. నగరంలోని ఓ ఐటీ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న ఆమె, నైట్ షిఫ్టుల కారణంగా పిల్లలిద్దర్నీ హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. అయితే, భర్తకు దూరంగా ఉండటం, పిల్లలు కూడా అందుబాటులో లేకపోవడంతో గత 15 రోజులుగా ఆమె తీవ్రమైన ఒంటరితనంతో బాధపడుతున్నట్లు బంధువులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని స్నేహితులతో చెబుతూ ఆవేదన చెందేవారని తెలిసింది. శనివారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి పిల్లలను కారులో తీసుకెళ్లిన విజయరెడ్డి, చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద కారు పార్క్ చేశారు. అక్కడే పార్కింగ్ స్లిప్ వెనుక "నాకు బతకాలని లేదు. నేను లేకపోతే పిల్లలు అనాథలవుతారు. అందుకే నాతో పాటే తీసుకెళ్తున్నా" అని సూసైడ్ నోట్ రాశారు. ఆ నోట్‌ను ఫొటో తీసి తన వాట్సప్ స్టేటస్‌గా కూడా పెట్టుకున్నట్లు తెలిసింది. అనంతరం పిల్లలతో కలిసి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలంలోని కారు నుంచి సూసైడ్ నోట్‌ను, విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపనున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె ఎవరితో మాట్లాడారు, చాటింగ్ వివరాలపై ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలు లేదా ఆస్తి తగాదాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

## చీరల గురించి కాదు..బడ్జెట్‌పై చర్చించండి

**సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం**

న్యూఢిల్లీ,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

## మేడారం జాతర విజయవంతం

**ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక -మంత్రి సీతక్క వెల్లడి**

ములుగు,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**

మేడారం సమక్క - సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారన్ని ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.ద

## మరింతగా దిగివస్తున్న బంగారం ధరలు

**24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530కి చేరిక**

**22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,900 -రూ.3 లక్షలకు చేరుకున్న కిలో వెండి ధర**

హైదరాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**



బంగారం, వెండి ధరలు పెట్టుబడిదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన వెండి, బంగారం ధరలు గత నాలుగైదు రోజులుగా అంతే స్థాయిలో పతనమవుతున్నాయి. ఆల్ టైమ్ గరిష్టానికి చేరుకున్న బంగారం, వెండి ధరల్లో భారీగా లాభాల స్వీకరణ జరుగుతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొనుగోలుదారులకు ఆనందాన్ని కలిగించకున్నా కొంతమేర దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,530కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే ఏకంగా 9,050 రూపాయలు తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,900కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 8,300 రూపాయలు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,51,680కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,39,050కి చేరుకుంది.మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన వెండి కూడా వేగంగా పతనమవుతోంది. ఐదు రోజుల క్రితం రూ.4.25 లక్షలకు చేరిన కిలో వెండి కొద్ది రోజుల్లోనే తిరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే కిలోకు రూ.50 వేల మేర తగ్గింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది.

# పెద్ద తుప్పర గ్రామ బి ఆర్ ఏస్ అధ్యక్షులుగా దిద్యాల శశికాంత్

## నియామక పత్రం అందజేసిన బిఆర్ ఏస్ సీనియర్ నాయకులు దుద్యాల శ్రీనివాస్



**ప్రజావినికిడి, (శంషాబాద్): డిసెంబర్ 02,** మండల పరిధి లోని పెద్ద తుప్పర గ్రామ బి ఆర్ ఏస్ అధ్యక్షులు గా దుద్యాల శశి కాంత్ ను నియమించి నియామక పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద తుప్పర గ్రామంలో సోమవారం బి ఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో రాష్ట్రం లో గ్రామపంచాయతీ లో గ్రామ కమిటీ నియామకం చేపట్టారు. శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద తుప్పర గ్రామంలో సోమవారం టిఆర్ఎస్ నూతన కమిటీ నియామకం చేపట్టారు.గ్రామ కమిటీ అధ్యక్షులుగా దుద్యాల శశికాంత్, ఉపాధ్యక్షులుగా జాజిమొగ్గల రాజు, రెండో ఉపాధ్యక్షులుగా కేతావత్ శ్రీకాంథ్, ప్రధాన కార్యదర్శిగా అంకం శ్రీశైలం, కోశాధికారిగా దుద్యాల శ్యాం కుమార్,సంయుక్త కార్యదర్శిగా తె లకమల దాస్, కార్యనిర్వహక కార్యదర్శిగా మైల శివ,కార్యవర్గ సభ్యులు నల్లో ల్ల కృష్ణ,నల్లో ల శ్రీ చరణ్,మహమ్మద్ అజం పాషా,చిర్ర దాసు,ఎండి నజీమ్,నల్లోల్ల అశోక్,బొగ్గుల విజయ్ గౌడ్, దుద్యాల కేశవ్, కేతావత్ అజయ్ లను నియమించి టిఆర్ఎస్ సీనియర్ నాయకుల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ దుద్యాల జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమ నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించడంలో సఫలీకృతుడై దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర పదంలో నిలిపిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని దశాబ్ద కాలంలోనే ప్రగతి పదంలో ముందుకు తీసుకువెళ్లిన ఘనత కేసీఆర్ ది అన్నారు. టిఆర్ఎస్ నూతన కమిటీ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు చిలకమర్రి నరసింహ, మండల పార్టీ అధ్యక్షులు మంచెర్ల మోహన్రావు, ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా,గ్రామ సర్పంచ్ సుమలత రాజు యాదవ్, ఉప సర్పంచ్ శేఖర్,వార్డు సభ్యులు ఎన్ అశోక్,డి.నరేష్, ఎన్ చెన్నకేశవ,డి. రాజు తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తా.. దిద్యాల శశికాంత్**

టిఆర్ఎస్ పార్టీ నాకు గ్రామ శాఖ అధ్యక్షునిగా అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిరాస ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు తో పాటు రాబోయే రోజుల్లో మరల అధికారంలోకి తెరాస ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తారని రాష్ట్రం ఈ రంగాల్లో అభివృద్ధి చెందుతుంది రాష్ట్రంలో ప్రజలందరూ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని గ్రామ కమిటీల్లో అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చిన సీనియర్ టి ఆర్ ఏస్ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# కెసిఆర్‌కు మద్దతుగా బిఆర్ఎస్ ఆందోళనలు

## కార్యకర్తలకు కెటిఆర్ కృతజ్ఞతలు



హైదరాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలువడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. గ్రామగ్రామాన బీఆర్ఎస్ శ్రేణులు తమ అధినేతకు మద్దతుగా కదం తొక్కారు. కార్యకర్తలు ఎక్కడికక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామగ్రామాన గర్జించిన కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'నిన్న ఉదయం నుంచే గ్రామగ్రామాన గర్జించిన మా కార్యకర్తలకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారియర్‌లకు, ప్రతి పట్టణంలో కదంతొక్కి మోటర్ సైకిల్ ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలతో హోరెత్తించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా గొప్పగా పోరాడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.

------

# 9,10 తేదీల్లో ఉస్మానిలో తెలుగు లిటరరీ కాంగ్రెస్

హైదరాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి** : ఈనెల 9, 10 తేదీల్లో రూమ్ నెంబర్ 133, ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం రెండు రోజులపాటు రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరగబోతోంది. యువరచయితల సాహిత్య సజన కేంద్రంగా జరగబోతున్న ఈ కాంగ్రెస్లో మొత్తం పది సెషన్లు ఉంటాయి. దాదాపు 55 మంది యువ కవులు, రచయితలు, నవలాకారులు, విమర్శకులు, సినిమా రచయితలు పాల్గొంటారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం తెలిపారు. ఈ రెండు రోజులూ ఆర్ట్స్ కళాశాల ముందు బహిరంగ ఆవరణలో కవితా దునియా, కవిత జిందగీ పేర్లతో కవితా పఠనం, గాన/కళా ప్రదర్శనలు జరుగుతాయి. దీంట్లో దాదాపు 40 మంది యువ కవిగాయకులు, జానపద వత్తికళా ప్రదర్శకులు పాల్గొంటారు. ఈ రెండవ కాంగ్రెస్ కు డైరెక్టర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షులు, ఆచార్య సాగి కమలాకర శర్మవ్యవహరిస్తారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

**చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**

**ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా**

**కెసిఆర్ విచారణ తరవాత ప్కటనపై హరీష్ రావు అభ్యంతరం**



హైదరాబాద్,**ఫిబ్రవరి2ప్రజావినికిడి** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నోసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సీట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

**ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు -మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**



**హైదరాబాద్,ఫిబ్రవరి2ప్రజావినికిడి** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.



# ప్రతిదానికీ నేనే స్పందిస్తుంటే మీరెందుకు ఉన్నట్టు?

**: జనసేన నేతలపై పవన్ కల్యాణ్ అసంతృప్తి!**

విజయవాడ, **ఫిబ్రవరి2ప్రజావినికిడి**
జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ పార్టీ నాయకుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంశంపైనా తానే స్పందించాల్సి వస్తుంటే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా మీరెందుకు ఉన్నట్టని మందలించారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగిన జనసేన కార్యవర్గ సమావేశంలో ఆయన పార్టీ నాయకులకు కీలక దిశానిర్దేశం చేశారు.ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎందుకు బలంగా తిప్పికొట్టడం లేదని పవన్ ప్రశ్నించారు. ఈ కల్తీ వెనుక వైసీపీ నేతలు, కొందరు అధికారుల పాత్ర ఉందని ఆధారాలతో సహా నిరూపించాలని సూచించారు. వైసీపీ నేతలు చేసే ప్రేరేపిత వ్యాఖ్యలకు, బెదిరింపులకు లొంగవద్దని హెచ్చరించారు."వైసీపీ నేతలు వేసే ఉచ్చులో పడొద్దు. మీపై, మీ కుటుంబ సభ్యులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. మహిళల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి" అని పవన్ హితవు పలికారు. విమర్శలకు సిద్ధాంతపరంగా, విషయ పరిజ్ఞానంతోనే సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, అధికార కూటమిపై సోషల్ మీడియాలో అనవసర వ్యాఖ్యలు చేయకుండా, కూటమి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పవన్ పిలుపునిచ్చారు. ఇందుకోసం గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# జోగి రమేశ్ బెయిల్ రద్దు చేయాలని సిట్ పిటిషన్



విజయవాడ, **ఫిబ్రవరి2 ప్రజావినికిడి** వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు నకిలీ మద్యం కేసులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఇటీవల మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజయవాడ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జోగి రమేశ్ బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారని, సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని సిట్ తన పిటిషన్‌లో ఆరోపించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది.నకిలీ మద్యం తయారీ, విక్రయాల కేసుకు సంబంధించి జోగి రమేశ్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రామును గతంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో వారు 83 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలే అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి కోర్టు వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు.అయితే, జైలు నుంచి విడుదలైన తర్వాత జోగి రమేశ్.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన టీడీపీ కార్యకర్తలు ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటిపై దాడి చేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై సుమారు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు కాగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై జోగి రమేశ్‌పైనా పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సిట్.. జోగి రమేశ్ బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఎలా ఉండనుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# మేం గేట్లు తెరిస్తే బిఆర్ఎస్‌లో ఎవ్వరూ మిగలరు

**మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద**ఫిబ్రవరి2ప్రజావినికిడి** మేం గేట్లు ఓపెన్ చేస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డిని కాదని కేసీఆర్ దగ్గరికి వెళ్లే నేతలు ఎవరూ ఉండరని మంత్రి స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని కేసీఆర్ అనడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్.. పదేళ్లలో కాంగ్రెస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తాము రెండేళ్లలో బీఆర్ఎస్ నేతలపై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదన్నారు. అక్రమంగా దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. తప్పు చేయకపోతే విచారణకు సహకరించాలి తప్ప.. భయపడటం ఎందుకని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో దుర్మార్గాలు జరిగాయన్నారు. అవన్నీ బయటపడాల్సి ఉందన్నారు.

------------------------

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు

● చరిత్ర సృష్టించిన బాబర్ ఆజామ్..



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు పాకిస్థాన్ అదిరిపోయే విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20లో సమష్టిగా చెలరేగిన పాకిస్థాన్ 111 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. 208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 96 పరుగులకే ఆలౌటైంది. మహమ్మద్ నవాజ్(5/18) ఐదు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. షాహీన్ షా అఫ్రిది(2/16) రెండు వికెట్లు తీసాడు. అబ్రర్ అహ్మద్, నసీమ్ షా తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో కామెరూన్ గ్రీన్(22), మార్కస్ స్టోయినిస్(23), జోష్ ఫిలిప్పే(14) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. సైమ్ అయుబ్(37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56), బాబర్ ఆజామ్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షాదాబ్ ఖాన్(19 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 46) దూకుడుగా ఆడారు. ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా బాబర్ ఆజామ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించాడు. బాబర్ ఆజామ్ ఇప్పటి వరకు 39 అర్ధ శతకాలు సాధించగా.. విరాట్ కోహ్లీ 38 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

## నన్ను ఓ ఉగ్రవాదిలా చూశారు..: టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్



టీమిండియా మాజీ పేసర్, వరల్డ్ కప్ విన్నర్ శ్రీశాంత్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన కాలాన్ని గుర్తు చేసుకున్నాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంతో తనను ఓ ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. జట్టులోని అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లతో కలిసి శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీసీసీఐ కూడా అతనిపై నిషేధం విధించింది. దాంతో శ్రీశాంత్ కెరీర్ అర్థాంతరంగా ముగిసిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు శ్రీశాంత్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, బీసీసీఐ అతనిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గించింది. నిషేధం ముగిసిన తర్వాత శ్రీశాంత్ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా సత్తా చాటలేకపోయాడు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు పలికి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా, సినీ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా తన సతీమణి భువనేశ్వరి కుమారితో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్... స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యాడు. 'నా జీవితంలోనే స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని మరిచిపోలేను. నా వివాహ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే అరెస్ట్ కావడం అతిపెద్ద విషాదం. 2012లో నాకు ఆరు సర్జరీలు జరిగాయి, నేను వీల్ చైర్‌కే పరిమితమయ్యాను. అదే సమయంలో నాపై ఉగ్రవాది అనే ముద్ర వేశారు. నా మామగారి దగ్గరకు వెళ్లి.. 'నేను మళ్ళీ క్రికెట్ ఆడలేకపోవచ్చు, పైగా నాపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి' అని చెప్పాను.'అని శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. శ్రీశాంత్‌పై వచ్చిన ఆరోపణలను తాను నమ్మలేదని అతని సతీమణి భువనేశ్వరి వివరించింది.'శ్రీశాంత్ అరెస్ట్ వార్త ఒక షాక్ లాంటిది. నా స్నేహితులు ఫోన్ చేసి టీవీ చూడమని చెప్పే వరకు నాకు ఈ విషయం తెలియదు. టీవీలో 'శ్రీశాంత్ అరెస్ట్' అనే వార్త చూసి నేను షాక్‌కు గురయ్యాను. వెంటనే మా నాన్న దగ్గరకు వెళ్లి ముందు నాకు ఒక మాట ఇవ్వండి.. నా పెళ్లి ఆపకూడదని కోరాను. స్వయంగా ఆ దేవుడే వచ్చి శ్రీశాంత్ తప్పు చేశాడని చెప్పినా నేను నమ్మను.'అని తన తండ్రితో గట్టిగా చెప్పినట్లు భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు.

# ఐసీసీ ఆంక్షలకు భయపడం..

**భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నాం**

**భవిష్యత్తులోనూ భారత్‌తో ఆడం**

**పాక్ టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. 'భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ భారత్ రావడానికి నిరాకరించినప్పుడు ఐసీసీ తేలికగా తీసుకుంది. కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం మారిపోయింది. గతంలోలా కాకుండా బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరించనుంది. ఐసీసీ ఆంక్షలు, మ్యాచ్ ఓటమి గురించి పీసీబీ ఆందోళన చెందడం లేదు. సాధారణంగా పీసీబీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోదు. చాలా ఆలోచించిన తర్వాతే ఈ అడుగు వేశారు. ఫిబ్రవరి 15 జరిగే మ్యాచ్‌తోనే ఇది ఆగిపోదు. మహిళల వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ 2028లో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాక్ ఇలానే బహిష్కరించనుంది. అయితే వ్యాపారవేత్తలు ప్రభుత్వాలను శాసిస్తారు. బ్రాడ్‌కాస్టర్లు ఊరుకోరు కాబట్టి ఏదో ఒక పరిష్కారం వెతుకుతారు. దౌత్యపరంగా ఏదో పరిష్కారం చూపించే ప్రయత్నం జరగవచ్చు.'అని ఆయన రషీద్ లతీఫ్ చెప్పుకొచ్చాడు.

# నా మాటలు వక్రీకరించారు: మేరీకోమ్

భారత ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ మరోసారి తన వైవాహిక బంధం గురించి మాట్లాడింది. ఇటీవల మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్‌పై ఆరోపణలు చేసే క్రమంలో ఆమె మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా తన తన మాజీ భర్తను ఉద్దేశించి మాత్రమే చేశానని, ఇంకెవరినీ బాధపెట్టాలని చేసింది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసింది. 'చాలా ఏళ్ల పాటు మా వైవాహిక బంధం సజావుగానే సాగింది. అయితే నా భర్త తనను ఆర్థికంగా మోసగించడం వల్ల మా రిలేషన్ దెబ్బతింది. ఆ తర్వాతే మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. గతేడాది మాకు విడాకులు మంజూరైన తర్వాత నాపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా దాడి జరిగింది. అయినా నేను సంయమనం పాటించాను' 'రీసెంట్‌గా ఒక టాక్‌షోలో నేను మాట్లాడిన మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించండి. ముఖ్యంగా పురుష సమాజం. ఆ మాటలన్నీ, నా వ్యక్తిగత జీవితంలో నేను అనుభవించిన బాధ నుంచి వచ్చినవే. అయితే నా మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. కానీ నేను ఏ ఆటకు కూడా వ్యతిరేకం కాదు. నేను క్రీడాకారులందర్నీ గౌరవిస్తా' అని మేరీకోమ్ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మేరీకోమ్ తన మాజీ భర్తపై ఆరోపణలు చేసింది.



అతడు 'గల్లీ ఫుట్‌బాల్' ఆటగాడంటూ విమర్శించింది. 'అనేక మందిలాగే అతడు కూడా ఓ సాధారణ గల్లీ ఫుట్‌బాల్ ప్లేయర్. అంతమాత్రాన అతను బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రి అవ్వలేడు. కెరీర్‌లో అసలు సక్సెస్ అవ్వలేడు' అని మేరీకోమ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఇందులో 'గల్లీ ఫుట్‌బాల్' అనే వ్యాఖ్యల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఇది కాంట్రవర్సీ అయ్యింది. ఈ వ్యాఖ్యలపై మేరీకోమ్ తాజాగా క్లారిటీ ఇస్తూ, క్షమాపణలు కోరింది. అయితే ఆమె మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్ ఓ ఫుట్‌బాల్ ఆటగాడు. అయితే మేరీకోమ్ కోసం తన కెరీర్‌ను సైతం వదులుకున్నానని కరుంగ్ గతంలో ఓ సందర్భంలో చెప్పారు. దీనిపైనే మేరీకోమ్ విరుచుకుపడింది. అలా మాట్లాడింది. అయితే తామిద్దరు దిల్లీలో కలుసుకున్నప్పటికే కరుంగ్ తన కెరీర్‌ను వదిలేశారని మేరీకోమ్ పేర్కొంది. 2005లో మేరీకోమ్-కరుంగ్ ఆంఖోలర్ వివాహం జరిగింది. మణిపుర్‌కు చెందిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్‌లో అనేక ఘనతలు సాధించింది. అంతర్జా తీయ వేదికల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మేరీకోమ్ ఎన్నో మరపురాని విజయాలు సాధించింది. 2012లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేతగా నిలిచింది. మహిళా బాక్సర్లలో ఇంకెవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా ఆరుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. 2016 నుంచి 2022 మధ్య రాజ్యసభకు కూడా మేరీకోమ్ ప్రాతినిధ్యం వహించింది. అయితే 41ఏళ్ల మేరీకోమ్ ప్రస్తుతం బిగ్ ఈవెంట్‌లలో ఆడకున్నా, రిటైర్మెంట్ తీసుకున్నట్లు మాత్రం ఎక్కడా ప్రకటిం చలేదు. దేశం తరపున ఇంకా పతకాలు సాధించాలనే ఆకలి ఉన్నట్లు గతంలో ఓ సందర్భంలో పేర్కొంది.

# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

● ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం

2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను



అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరపున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరపున అరంగేట్రం చేశాడు. మొదటి బంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

# ఇండియా-ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ

టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా సన్నాహకాల్లో భాగంగా రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం బీసీసీఐ సోమవారం (ఫిబ్రవరి 2) ఇండియా-ఎ జట్టును ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మ రీ-ఎంట్రీ ఇవ్వడం, ఐపీఎల్ స్పీడ్ స్టార్ మయాంక్ యాదవ్ జట్టులోకి రావడం ఈ స్క్వాడ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమిండియా తన సన్నాహకాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అమెరికా, నమీబియాతో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ, యువ రక్తాన్ని పరీక్షించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి జట్టు పగ్గాలను అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న బదోనికి ఇది ఒక పెద్ద అవకాశం. తెలుగు క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. గాయం కారణంగా కొన్నాళ్లు దూరమైన తిలక్ వర్మ జట్టులోకి తిరిగొచ్చాడు. సర్జరీ తర్వాత కోలుకున్న తిలక్, ఫిట్‌నెస్ టెస్ట్ పాసై జట్టులో చేరాడు. అయితే ఇందులో ఒక చిన్న ట్విస్ట్ ఉంది. తిలక్ వర్మ ఇండియా-ఎ తరపున కేవలం ఒకే ఒక్క వార్మప్ మ్యాచ్ ఆడతాడు. ఆ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాత నేరుగా టీమిండియా(సీనియర్ జట్టు)లో చేరి వరల్డ్ కప్ ఆడతాడు. ఇది తిలక్ కెరీర్‌కు అత్యంత కీలకమైన సమయం. ఐపీఎల్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో ఆడిన తర్వాత గాయపడిన మయాంక్, సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. అతని వేగం టీమిండియాకు రాబోయే రోజుల్లో పెద్ద ఆస్తి కానుంది. మయాంక్ తో పాటు ఖలీల్ అహ్మద్, రవి బిష్ణోయ్ వంటి సీనియర్ బౌలర్లు కూడా ఈ జట్టులో ఉండటం విశేషం. ఇక రెండో మ్యాచ్ ఫిబ్రవరి 6 (శుక్రవారం) నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచుల ద్వారా యువ ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలించి, అవసరమైతే మెయిన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి ఎవరినైనా తీసుకునే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ వంటి హిట్టర్లు ఈ జట్టులో ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఇండియా-ఎ స్క్వాడ్ (వార్మప్ మ్యాచుల కోసం): ఆయుష్ బదోని (కెప్టెన్), నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ, ప్రియాంశ్ ఆర్య, ఎన్.జగదీశన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, రియాన్ పరాగ్, మానవ్ సుతార్, అశోక్ శర్మ, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్), గుర్జాప్నీత్ సింగ్, విప్రజ్ నిగమ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్.




# జైలర్-2లో షారూఖ్ ఖాన్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

## మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్



కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు.
తర్వాత టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# ముసి ముసి నవ్వులతో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన ఫరియా అబ్దుల్లా!



ఏ హీరోయిన్ అయినా సరే ఒక మంచి పాత్ర దొరికితే ఆ పాత్రకు తగ్గ కంటెంట్ పడింది అంటే.. ఇక తమ టాలెంట్ తో రెచ్చిపోతారు అనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఎంతోమంది అలా మంచి మంచి పాత్రలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొని ఇప్పుడు స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఒకప్పుడు తన గ్లామర్ తో అందాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన చిట్టి అలియాస్ ఫరియా అబ్దుల్లాకు ఇప్పుడు సరైన క్యారెక్టర్ లభించింది అనే వార్తలు వినిపిస్తున్నాయి
జాతి రత్నాలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె తన నటన కంటే కూడా తన హైట్ తోనే అందరి దృష్టిలో పడింది. ముఖ్యంగా ప్రభాస్, మహేష్ బాబు లాంటి హీరోలు అయితేనే ఈమెకు సెట్ అవుతారనే కామెంట్లు కూడా వ్యక్తమయ్యాయి. దీనికి తోడు ఇటీవల విశ్వక్ సేన్ కూడా సిజి ఇంకా డెవలప్ అయితే ఆమెతో సినిమా చేస్తానని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు. అలాంటి ఫరియా అబ్దుల్లా తనకంటూ ఒక ఇమేజ్ దక్కించుకోవడానికి ఎంతో ప్రయత్నం చేసింది. అయితే అందుకు తగ్గట్టుగా అవకాశాలైతే రాలేదు. ముఖ్యంగా కొన్ని సినిమాలలో స్పెషల్ సాంగ్స్ కూడా చేసి ఆకట్టుకుంది ఫరియా అబ్దుల్లా. కానీ ఎట్టకేలకు ఆమె కష్టాన్ని దర్శక నిర్మాతలు గమనించినట్టు ఉన్నారు. అందుకే ఆమెకు తిరువీర్ హీరోగా నటిస్తున్న భగవంతుడు సినిమాలో స్పెషల్ రోల్ ఇచ్చి ఆమె నటనను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పాలి. ఇందులో తొలిసారి పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటించడమే కాకుండా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పించబోతోంది అంటూ మేకర్స్ స్పష్టం చేశారు. ఎప్పుడు చిట్టిపొట్టి బట్టలతో గ్లామర్ టచ్ ఇస్తూ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న చిట్టి.. ఈ సినిమాలో లంగా ఓణీతోనే కాదు తన నటనతో కూడా మెప్పిస్తానని చెబుతోంది మరి భగవంతుడు సినిమా చిట్టికి ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి.

# కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ




టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఓటిటిలో ట్రెండ్ అవుతున్న శంబాలా



ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

## ‘పాంచాలి పంచభర్తృక‘ సినిమా

# టీజర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న “పాంచాలి పంచభర్తృక” సినిమా టీజర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, హాస్యం ఒక మంచి ఔషధం లాంటిదని, అపహాస్యం కాకుండా ఆరోగ్యకరమైన హాస్యంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేయడాన్ని అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సినీ పరిశ్రమ అభివృద్ధికి, సినిమా కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. చిత్ర నిర్మాణ బృందానికి మంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ చిత్రానికి గంగ సప్తశిఖర రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట దుగ్గిరెడ్డి (యూఎస్ఏ) నిర్మాతగా, శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మన్యం సహ నిర్మాతలుగా... రాయల్ త్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయి రామ్ ఆర్ట్స్ బ్యానర్లపై తెరకెక్కుతోంది.
ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్‌తో పాటు రోల్ రైడా, జెమినీ సురేష్, పృథ్వీరాజ్, శ్రీకాంత్ అయ్యంగార్, సరీఫ్ ఫర్, రూపలక్ష్మి, రాజ్ పవన్, రవి రెడ్డి, జబర్దస్త్ నవీన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబీ కేఎస్ఆర్ కథ అందించగా, రాజ్ పవన్ స్క్రీన్‌ప్లే సమకూర్చారు. మహేశ్ నారాయణ, బిషేక్ సంగీతం అందిస్తుండగా, కెవి ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా, జానీ బాషా ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613